# దివ్యవనాలు - విశిష్టత 13



జె. వేణిమాధవి
నేచురలిస్ట్

*(గత సంచిక తరువాయి)*

## కార్తీక పౌర్ణమి (నవంబరు 10)

బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం॥



నాగలింగం పువ్వు





దీని పువ్వులు చెట్టుకాండం మీద పూస్తాయి. కాయలు ఫిరంగి గుండుల్లాగా ఉంటాయి.

| | | |
|---|---|---|
| శాస్త్రీయ నామం | : | **'కోరోపీటా గైనేన్సిస్'** |
| సంస్కృత నామం | : | నాగ పుష్పం |
| ప్రాంతీయ నామం | : | నాగలింగం చెట్టు |
| ఆంగ్ల నామం | : | 'కానన్ బాల్ ట్రీ' |

ఈ దివ్యవృక్షాలు మనకి పూర్వకాలం దేవాలయాలలో, ప్రత్యేకించి శివాలయాలలో కనిపించేవి. వీటి పుష్పాల నిర్మాణం చాలా విశిష్టంగా ఉంటుంది. దీనిని సృష్టికర్త చాలా శ్రద్ధగా, ఉన్నతంగా తీర్చిదిద్దినట్లుగా ఉంటుంది. ఈ పువ్వులో ఒక్క శివుడే కాదు, త్రిమూర్తులు ముగ్గురూ దర్శనమిస్తారు.

**బ్రహ్మ** : ఐదు ఎర్రని రేకులు, పద్మంలాగా ఉంటాయి.

**విష్ణువు** : దీని ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పుప్పొడి, మొదలగు భాగాలు క్షీరసాగరములోని శేషపాన్పు మరియు పాముపడగల వలే ఉంటుంది.

**శివుడు** : ఇక ఆ శేషపాన్పుకి మధ్యలో దివ్యమైన శివలింగం దర్శన మిస్తుంది.

ఈ పవిత్రమైన కార్తీకమాసంలో ఈ నాగలింగం మొక్కని శివక్షేత్రాలు, శివాలయాలలో "ఒక్క మొక్క నాటితే వెయ్యి శివలింగాలు ప్రతిష్ఠించినంత ఫలితం వస్తుంది" అని పురాణాలు ఉద్ఘోషిస్తున్నాయి.

### వైద్య రత్నాలు :

* ఈ దివ్యవృక్షంలో ఆంటీ బయోటిక్, ఆంటీ ఫంగల్, ఆంటీ సెప్టిక్ మరియు అనాల్జిసిక్ గుణాలు ఉన్నాయి.
* జలుబు, పొట్టనొప్పి, తలనొప్పులను తగ్గిస్తుంది.
* ఆకుల రసంతో చర్మవ్యాధులు, చిగుళ్ళరసంతో పన్నుపోటు తగ్గుతాయి.
* దీని పండ్లను కొన్ని ప్రాంతాలవారు తింటారు. వాటికి గాయాల్లోని వ్యాధికారక క్రిములను నశింపచేసే గుణం ఉంది.

శివుడికి తుమ్మి పువ్వులు, అవిశ పువ్వులు, జిల్లేడు పువ్వులు, పచ్చ గన్నేరు పువ్వులు, రుద్రాక్షలు మొదలగునవి అత్యంత ప్రీతిపాత్రములు. ఈ వృక్షాలను, మొక్కలనూ కూడా తప్పనిసరిగా శివాలయాలలో పెంచాలి.

### దేవాలయాలు ఎలా మొదలయ్యాయి?

పూర్వపు రోజుల్లో మునులూ, ఋషులూ, జప తపాదులూ, యజ్ఞ యాగాదులూ ఆచరిస్తూ అడవులూ, వనాలలో ఆశ్రమాలు ఏర్పరచుకొని ఉండేవారు. అక్కడ సంచరిస్తున్న సమయాలలో వారికి అద్భుతమైన శక్తి క్షేత్రాలు తారసిల్లినప్పుడు, ఆ పరిసరాల్లో ఉన్న దివ్య వృక్షాలను గుర్తించి, అక్కడ ఏ దేవత యొక్క శక్తి, ఉనికి ప్రస్ఫుటంగా ఉందో



ఆటంకాలు ఉన్నప్పటికీ, పనిచేసేవారే అభివృద్ధి చెందగలుగుతారు.

గమనించి సూచనప్రాయంగా ఆయా సంబంధిత దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించి వాటికి ఒక నీడను కల్పించడం జరిగేది. ఆ వృక్షాలకి ఎటువంటి హానీ తలపెట్టకుండా, వాటికి అనుగుణంగా ఆ విగ్రహాలను ప్రతిష్ఠించి ఆవాసాన్ని ఏర్పరచేవారు. దానినే 'దేవారామము' లేక 'దేవాలయము' అని పిలిచేవారు.

ఇలా చేయటం వల్ల, అటుగా ఎవరైనా వెళ్ళినప్పుడు, ఆ ప్రదేశము యొక్క ప్రాముఖ్యతను గమనించి, అక్కడ జప తప ధ్యానాదులు ఆచరించుటకు అవకాశము కలిగేది. ఇటువంటి ప్రదేశాలలో పుణ్య కార్యాలను ఆచరించినచో విశేష ఫలితాలు ఉంటాయని ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఎరుక కలిగి ఉండేవారు.

ఈ దివ్యవనాలతో అలరారుతున్న తిరుమల, శ్రీశైలం, శ్రీకాళహస్తి మొదలగు పుణ్యక్షేత్రాలు ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. కానీ ఈ రోజుల్లో కనీసం ఒక్క మొక్క కూడా ఉండని దేవాలయాలు మనకి కోకొల్లలుగా కనిపిస్తున్నాయి లేదా మంచి ఆదాయాన్నిచ్చే చెట్లను పెంచి కొన్ని సంవత్సరాల్లో వాటిని నరికేస్తున్నారు. ఈ చర్య, మాంసాహారాన్ని అమ్ముకొనే కసాయివాడు చేసే చర్యతో సమానం. (అవి ఏపుగా, లావుగా, ఎత్తుగా పెరిగేంత వరకు ఆగి, చంపి సొమ్ముచేసుకోవడం) దివ్యవృక్షాలు లేని దేవాలయాలు జీవంలేని కట్టడాలు మాత్రమే. ఇవి సంపూర్ణ ఫలితాలని ముమ్మాటికీ ఇవ్వవు. దేవాలయాలకు భూములను కేటాయించేది ఈ దివ్యవనాలను పెంచడానికే.

ఇకనైనా మేల్కొని ఈ కార్తీకమాసంలో మన చుట్టుప్రక్కల్లోని శివాలయాల్లో పైన తెలిపిన మొక్కలను నాటితే వంద పూజలూ, వేయి స్తోత్రాలూ, లక్ష జపాలు, కోటి ధ్యానాలూ చేసినంత ఫలితాలను పొంది ఉత్తమ లోకాలకు వెళతామని సాక్షాత్తు ఆ పరమశివుడు చెప్పాడు.

## గురునానక్ జయంతి – నవంబరు 10

*భూమి తల్లి; నీరు తండ్రి, గాలి గురువు – 'గురు గ్రంథ్ సాహిబ్'*





శ్రీ గురునానక్ జీ
(క్రీ.శ. 1469 – 1539)

గురునానక్ చిన్నప్పుడు ఒకరోజు గోవులను కాస్తూ ఒక చెట్టుక్రింద నిద్రించాడు. ఆ ఊరి జమీందారుగారు గుర్రంమీద అటుగా వెళ్తూ ఒక విచిత్రాన్ని గమనించాడు. అన్ని చెట్ల నీడలు ఒకవైపుకి ఉండగా, గురునానక్ పడుకుని ఉన్న చెట్టునీడ మాత్రం సూర్యునితో సంబంధము లేకుండా, గురునానక్‌కు నీడ కలిపిస్తూ ఉన్నది. ఇదేకాకుండా ఒక



పెద్ద నల్లని త్రాచుపాము తన పడగ విప్పి ఆయనకు రక్షణగా నిలిచి ఉన్నది. అప్పుడా జమీందారు ఇతడు భవిష్యత్తులో గొప్ప వ్యక్తి అవుతాడని గ్రహించి చేరదీసి ఆదరించాడు. దీనిలో పదిమంది మత గురువులున్నారు. 'గురు గ్రంథ్ సాహిబ్' వీరి మతగ్రంథము. భారత్, పాకిస్తాన్ మరియు ప్రపంచ దేశాల్లో అనేక గురుద్వారాలు ఉన్నాయి. వీటిలో కొన్ని గురుద్వారాలు వివిధ దివ్యవృక్షాల పేర్లమీద ఉన్నాయి. మచ్చుకి కొన్ని చూద్దాము.

గురుద్వారా అంబ్ సాహిబ్ (మొహాలి, చండీఘడ్) మామిడిచెట్టు
గురుద్వారా ఇమ్లి సాహిబ్ (కిరియాప్షనా, రోపార్ జిల్లా) చింతచెట్టు
గురుద్వారా ఫలాహి సాహిబ్ (దులేయ్, లుథియానా), అమృత్‌సర్ గమ్ ట్రీ
గురుద్వారా తహ్లి సాహిబ్ (రాజ్‌కోట్, లుథియానా),
శింశుపా, సిస్సూ చెట్టు
గురుద్వారా రేహ్రు సాహిబ్ (రాంపూర్, లుథియానా), తెల్ల తుమ్మచెట్టు
గురుద్వారా నీమ్ సాహిబ్ – వేపచెట్టు
గురుద్వారా బెర్ సాహిబ్ – రేగు చెట్టు.

(ఎక్కడెక్కడ ఏ వృక్షాల క్రింద ఈ గురువులు వారి బోధలను చేసారో ఆ చెట్ల వద్ద ఈ పుణ్యక్షేత్రాలు ఏర్పడ్డాయి. ఈ వృక్షాల ద్వారా ఆ గురువులు సజీవంగా మన మధ్య ఉన్నట్లే. కానీ ఇప్పుడా చెట్లను అభివృద్ధి, చక్కదనముల పేరిట తొలగించి, కేవలం జీవంలేని కట్టడాలకు ప్రాముఖ్యతను ఇవ్వడం కడు శోచనీయం.)

## మీ వృక్షం ఏది?

### 25. పూర్వాభాద్ర నక్షత్రం – వేప చెట్టు

| | | |
|---|---|---|
| శాస్త్రీయ నామం | : | **'అజార్డిరెక్ట ఇండికా'** |
| సంస్కృత నామం | : | నింబ వృక్షం |
| ప్రాంతీయ నామం | : | వేప చెట్టు |
| ఆంగ్ల నామం | : | నీమ్ ట్రీ |



అవకాశాలు ఒకరిచ్చేవి కావు, మనమే వాటికై కృషి చేయాలి.



**ఔషధ గుణాలు :**

1) వేపలో ఆంటీసెప్టిక్ మరియు క్రిమి సంహారక గుణాలు సమృద్ధిగా ఉన్నాయి.
2) ఇది గజ్జి, ఇంకా ఇతర మొండివ్యాధులను తగ్గిస్తుంది.
3) బొల్లి, చుండ్రులను నివారిస్తుంది.
4) ప్రేగుల్లోని పుండ్లు, గడ్డలను తగ్గిస్తుంది.
5) నులి పురుగులు, బద్దె పురుగులు మొదలగు క్రిములను నిర్మూలిస్తుంది.
6) ఊపిరితిత్తుల వ్యాధులు, మధుమేహాన్ని నయం చేస్తుంది.

**విశేష గుణాలు :**

1) ఉగాది పండుగ సమయంలో అంటే చలికాలం నుంచి వేసవి కాలంలోకి అడుగిడే సమయంలో 'వేప పువ్వు పచ్చడి' తీసుకుంటే, ఆ కాలమంతా ఎటువంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తవు.
2) షిరిడీబాబా ఒక వేపచెట్టు మొదట్లో పన్నెండేళ్లు తపస్సు చేసారు. అది ఆయన గురుస్థానం. భక్తులకి అక్కడ నాలుగు వెలుగుతున్న దీపాలు కనిపిస్తాయి. ఆ చెట్టు షిరిడీలో ఇప్పటికీ ఉంది. దాని ఆకులు చెద లేకుండా యధావిధిగా, చక్కగా ఉండటం విశేషం.
3) వేపచెట్టు సంతానవనంలో ఒకటి.
4) వృక్ష సామ్రాజ్యం సమస్తమైన జీవులకి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంటే, ఈ నింబవృక్షం తన క్రిమిసంహారక గుణాలతో వృక్ష సామ్రాజ్యాన్నంతటినీ సంరక్షిస్తుంది. (వేప నూనె, వేపపిండి, సహజసిద్ధమైన క్రిమి సంహారకాలు) అంటే సమస్తమైన మానవులూ, జీవులను ఇది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కాపాడుతుంది. ఇదే అసలైన కల్పవృక్షమని ఒక వర్గం శాస్త్రవేత్తలు, ఆధ్యాత్మికవేత్తల ప్రతిపాదన.



## 26. ఉత్తరాభాద్ర నక్షత్రం - మామిడి చెట్టు

| | | |
|---|---|---|
| శాస్త్రీయ నామం | : | **'మేన్జిఫెరా ఇండికా'** |
| సంస్కృత నామం | : | చూత వృక్షం |
| ప్రాంతీయ నామం | : | మామిడిచెట్టు |
| ఆంగ్ల నామం | : | మాంగో ట్రీ |

**ఔషధ గుణాలు :**

1) ఇది ఎక్కిళ్ళు, గొంతు రుగ్మతలు, నోటిపూతను తగ్గిస్తుంది.
2) గాయాలు, చిన్నక్రిముల వల్ల వచ్చే దురదలు, దద్దుర్లను మాన్పుతుంది.
3) అరుగుదలను పెంచి, ఆకలి లేకపోవటాన్ని, అల్సర్లను నివారిస్తుంది.
4) ఋతుక్రమాన్ని క్రమబద్ధీకరిస్తుంది.
5) రక్తహీనతను తగ్గిస్తుంది.
6) నీరసము, నిస్సత్తువులను వెంటనే తగ్గిస్తుంది.
7) మామిడాకులు లేనిదే ఏ శుభకార్యమూ జరుగదు. శాస్త్రీయంగా చూస్తే, వీటికి చెట్టుమీద నుంచి కోసిన రెండు మూడు రోజుల వరకూ ప్రాణవాయువును విడుదల చేసే గుణము ఉంది.
8) రాశులలో ఇది కన్యారాశికి సూచించబడింది.
9) అశోకవనములో కూడా ఉన్నట్లు సుందరకాండలోని వర్ణన బట్టి తెలుస్తోంది.
10) ఇది పంచపల్లవములలో కూడా సూచించబడింది. అంటే, పూజా వ్రతాదులు మరియూ కలశాలలో వాడే పత్రాలు.
11) శ్రీ విఘ్నేశ్వరుడికి వినాయకచవితి పండగప్పుడు సమర్పించే ఏకవంశతి పత్రాలలో ఇది ఒకటి.

*సూచన : ఔషధ గుణాలు సూచనమాత్రంగా ప్రస్తావించడం జరిగింది. వైద్యుని సంప్రదించిన పిదపనే వాటిని ఉపయోగించమనవి.*

(సశేషం)



ఈ ప్రపంచంలో అన్నీ నశించేవే, భావాలు, ఆశయాలు, కలలు తప్ప.